"బ్రహ్మం ! మా పనిమనిషి మరీ ముసలమ్మయిపోయిందోయ్. ఎవరైనా అమ్మాయిని చూడు. దీన్ని మాన్పించేస్తాను. గ్లాసులు, కప్పులు పగలగొడుతోంది. కూరల్లో వుప్పు, కారం దంచేస్తోంది. ఏమన్నా అంటే కళ్ళు కనపడ్డం లేదు సారూ ! అంటుంది. చస్తున్నాననుకో." అన్నాడు హనుమంతయ్య.

"ఎన్నాళ్ళనుంచో పనిచేస్తున్నది కదా ! కంటికి శుక్లాలు వచ్చేయేమో? డాక్టర్‌కి చూపించి కళ్ళజోడు ఇప్పించు. దివ్యంగా పనిచేస్తుంది. అంతేగాని కుర్ర పిల్లల్ని పెట్టుకోకు. ప్రాబ్లమ్స్ వస్తాయి" అన్నాడు రామబ్రహ్మం.

"ఏం ప్రాబ్లమ్స్ వస్తాయంటావు? సరిగా పనిచేస్తే వుంటుంది. లేకపోతే పోతుంది" అన్నాడు హనుమంతయ్య.

"మా గురవయ్యకి జరిగింది వింటే నువ్వీమాట అనవు" అని నవ్వాడు రామబ్రహ్మం.

"ఎవరా గురవయ్య? ఏమాకథ?"

"మా వూరాయనేలే. నీలాగే రిటైరై ఒంటరిగా వుంటున్నాడు" అని మొదలుపెట్టాడు రామబ్రహ్మం.

"ఒకరోజు పొద్దున్నే గురవయ్య ఫోన్‌చేసి అర్జెంటుగా రమ్మన్నాడు. ఏంటయ్యా కథ? అంటే వచ్చాక చెప్తాను రమ్మన్నాడు. గురవయ్యకి కంగారెక్కువ. ఏ ప్రాబ్లమ్ వచ్చిందోనని వెళ్ళాను.

నేను వెళ్ళేసరికి గురవయ్య ఇంట్లో పనిచేసే అహల్య. దాని తల్లి చంద్రమ్మ. ఇంకెవరో యువకుడు వున్నారు. అక్కడ వాతావరణం ఎందుకో గంభీరంగా వుంది. ఆ యువకుడు ఖద్దరు బట్టల్లో దర్పంగా కనిపించాడు. గోల్డ్‌ఫ్రేమ్ బ్లాక్ కళ్ళద్దాలు, చేతులకు వుంగరాలు ముంజేతికి బ్రాస్‌లెట్, మెడలో దళసరి చైనూ చూసి ఎవరో ఛోటా రాజకీయ నాయకుడేనని అనిపించింది.

అదే మాట చెప్పి గురవయ్య పరిచయం చేశాడు.

"యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లింగారావు."

"మీ కోసమే ఎదురు చూస్తున్నాం" అన్నాడు లింగారావు.

"నా కోసమా? ఏమిటి విశేషం?" అన్నాను.

గురవయ్య "అదీ..." అని ఏదో చెప్పబోయాతుండగా లింగారావు అడ్డుకుని

"మీరుండండి నన్ను చెప్పనీయండి" అన్నాడు.

"చెప్పండి" అన్నాను.

మీకు తెలుసుగా ఈ గురవయ్య ఇంట్లో ఈ పిల్ల పనిచేస్తుంది" అన్నాడు.

